# అర్ధనారీశ్వరం



**రాధిక** స్టేజి మీద నున్న అర్జున్ కేసి తదేకంగా చూస్తోంది.

'నిజమే, ఆడదాని వేషం చాలా చక్కగా ఒప్పిస్తున్నాడు. ప్రేక్షకులు చప్పట్లు కొట్టారంటే కొట్టరూ. ప్రైజు ఖాయం అని వెనక్కాల గుసగుసలు పోతున్నారు కూడా. తెలియనివాళ్ళకు ఆడపిల్లే వేషం వేస్తోందనకుంటారు కూడా. అంతబాగా నప్పాడు.

కానీ అలా నప్పడమే తనకు నచ్చలేదు. ఆ ఆఫర్ వచ్చినప్పుడు అర్జున్ వెంటనే చెప్పాడు – "ఈ సారి కాలేజీ నాటకాల పోటీలో వేషం వేయమంటున్నారు. ఫరే ఛేంజ్ అమ్మాయిగా వేయమంటున్నాడు సురేష్..." అంటూండగానే తను కట్ చేసింది.

"వద్దనలేకపోయావా? వాళ్ళ కళ్ళకు నువ్వు ఆడదానిగా కనబడుతున్నావా ?" అంది చికాకు పడుతూ.

అర్జున్ కోపం తెచ్చుకోలేదు. "నీ కళ్ళకు హీరోలా కనబడుతున్నానుగా అది చాలు, తక్కినవాళ్ళు ఏమనుకుంటే నాకేం?.. అది సరేలే, విషయం ఏమిటంటే.. లేడీ కారెక్టరు పెద్దది. చాలా ముఖ్యమైనది. సురేష్ హీరోగా వేస్తున్నాడు. మొన్న కాలేజ్ ఎలక్షన్లో లేడీసంతా సురేష్‌కి వ్యతిరేకంగా ఓటేసారుగా.

ఇప్పుడెళ్లి వాళ్ళని బతిమాలడం ఇష్టం లేక నన్ను రిక్వెస్టు చేసాడు. పోనీ మనదీ పెద్ద పెర్సనాలిటీ కాదుగా. ఆడదానిగా వేస్తే ఎలావుంటుందో చూద్దామని....” అంటూ అర్జున్ నచ్చచెప్పాడు.

కానీ తనకా ఐడియాయే నచ్చలేదు. ఆడదానిలా కులికేవాణ్ని తను ప్రేమించగలదా? ఛ,ఛ అనుకొంది. ఇప్పుడు స్టేజిమీద అర్జున్‌లో అచ్చమైన ఆడతనం చూస్తున్నకొద్దీ తన ఊహ కరెక్టే అనిపిస్తోంది. ఇతనిలో మగవాడు కనబడటం లేదు. ఈ ఆడంగివాణ్ని ప్రేమించడం ఏమిటి, అసహ్యంగా! ఆడవాళ్ళు ఆడవాళ్ళలా ఉండాలి. మగాళ్ళు మగాళ్ళగా ఉండాలి. మీసాలున్న ఆడవాళ్ళన్నా, ఒయ్యారంగా నడిచే మగాళ్ళన్నా తనకసలు మొదటినుంచీ అసహ్యం. అమితాబ్ బచ్చనైనా కానీ, బారాత్ సీన్‌లో ఆడవాళ్ళలా వగలు వలకబోస్తే ఒళ్ళు మండుతుంది. అలాటిది ఇప్పుడు తన లవరే... ఇలా... నయం, తన ప్రేమ ఇంకా తొలిదశలోనే ఉంది. ఈజీగా బైబై చెప్పేయచ్చు. అని నిశ్చయించుకుంది రాధిక.

నాటకం సా...గుతునే వుంది. ప్రేక్షకులు అర్జున్ నటనకు పులకించిపోతున్నకొద్దీ ఆమెకు దుస్సహంగా వుంది. లేచి బయటకు వచ్చింది. ఇంతలో ఇంటర్వల్ వచ్చింది. లత కనబడింది. “రాధికా, రా, గ్రీన్‌రూమ్ కెళ్ళి అర్జున్‌కు కంగ్రాట్యులేట్ చేసి వద్దాం. మన క్లాసుమేటుకదా. ఎంకరేజ్ చేయకపోతే ఎలా?” అని గ్రీన్‌రూమ్‌కి లాక్కెళ్ళింది.

రాధిక కంటబడగానే అర్జున్ కళ్ళు నవ్వాయి, చుట్టూ ఎంతమంది అభినందనలు కురిపిస్తున్నా అతని కళ్ళు ఆమెనే వెంటాడుతున్నాయి. అతని వెనక్కాలే వెళ్ళింది రాధిక. ‘వేషం బాగా కుదిరింది’ అనడానికి మనసు రాలేదు. “ఇంటర్వెల్ తర్వాత కూడా ఇంకా పోర్షన్ ఉందా?” అంది సింపుల్‌గా.

“ఆ, ఇప్పణ్నుంచి ఆధునిక యువతిలా వేషం వేయాలి. పట్టుచీర ఇప్పిపారేసి బట్టలు మార్చుకుందామంటే గ్రీన్‌రూమ్ పట్టకుండా జనం. అభినందనలు చెప్పేవాళ్ళు ఎక్కువయిపోయారు. ఎలాగని చూస్తున్నాను.” అన్నాడు అర్జున్.

ఒక్కక్షణం ఆగి, “లేడీస్ మేకప్‌రూమ్‌లో కాస్తచూడు, వాళ్ళంతా డ్రస్ చేసుకొని వింగ్స్‌లోకి వెళ్ళినట్టున్నారు. ఖాళీగా ఉంటే అక్కడ డ్రస్ మార్చుకుంటాను. టైమైపోతోంది.” అన్నాడు.

లేడీస్ మేకప్ రూమ్ ఖాళీగానే ఉంది. ఒకే ఒక అమ్మాయి కనుబొమ్మలు దిద్దుకుంటోంది. అర్జున్ బట్టలు పట్టుకుని లోపలికి దూరాడు. ‘అక్కడున్న బాబ్డ్ హెయిర్ విగ్ తెచ్చి పెడతావా” అంటూ రాధికను పిలిచాడు. రాధిక వెంట వెళ్ళింది. కనుబొమ్మలమ్మాయి వీళ్ళని పట్టించుకోలేదు. ఆడవాళ్ళే అనుకొందేమో. అర్జున్ గబగబా పాత డ్రెస్సు ఇప్పాడు. చిన్న డ్రాయర్‌తో మిగిలేడు. అతనికి బట్టలందిస్తూ రాధిక అతని కాళ్ళకేసి చూసింది. మంచి షేపైన కాళ్ళు, చిక్కగా పెరిగిన రోమాలు.

అతన్ని ఇలా చూసే అవసరం, ఆవకాశం ఇప్పటిదాకా రాధికకు కలగలేదు. ‘ఇలాటి ఫంక్షన్లలో సిగ్గుయెగ్గులు మర్చిపోతారేమో, లేకపోతే అర్జున్ తన ఎదుట ఇలా అర్ధనగ్నంగా కనబడే సాహసం చేసేవాడా?’ అని రాధిక ఆలోచిస్తూండగానే అర్జున్ కొత్త వేషం వేసుకోవడం పూర్తిచేసాడు. విగ్గు పెట్టుకోవడం తరువాయి.

గదిలోంచి కనుబొమ్మలమ్మాయి వెళ్ళిపోవడంతో, అతని ట్రూపువాళ్ళు మగాళ్ళ గ్రీన్‌రూమ్‌లోంచి స్టేజి మీదకు వెళ్ళిన అలికిడి వినబడటంతో అతనికి ధైర్యం వచ్చినట్టుంది. దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామని రాధిక జబ్బ పట్టుకుని దగ్గరకు లాక్కొన్నాడు. వద్దు వద్దనుకుంటూనే రాధిక ముందుకడుగేసింది. అతని అర్ధనగ్నశరీరం కంటబడడం ఆమెపై మత్తు జల్లిందేమో. ఏం జరుగుతోందో తెలిసేలోపున ఆమె అతని కౌగిలిలో ఉంది. అదే వారి తొలికౌగిలి. బిగికౌగిలికి తన పెట్టుడు ఛాతీ అడ్డువస్తోందని గ్రహించాడులా వుంది, అర్జున్ ఆమె పిరుదులు పట్టుకుని ముందుకు లాక్కుంటూ తన కాలితో ఆమెను చుట్టివేసాడు.

ప్రేక్షకుల పొగడ్తల నిషా, చప్పట్ల నిషా తలకెక్కి ఉద్వేగం పొందిన అతని శరీరం శ్రుతి చేసిన వాయిద్యంలా ఉంది. ఆబగా కౌగలించుకొన్నాడామెను, తనలో పూర్తిగా ఇమిడ్చేసుకుందా మనుకున్నట్లు. దృఢమైన అతని శరీరం ఆమెలో ఆడతనాన్ని మేల్కొల్పింది. అతని మగతనాన్ని గుర్తు చేసింది. తల

పైకెత్తి ఆర్తిగా చూసింది. అతను చప్పున ఆమె పెదాలందుకున్నాడు. గట్టిగా చుంబించాడు. వేషం కోసం మీసం తీసేసిన అతని పై పెదవి ఆమె ముక్కుకి గరుకుగా తగిలింది.

కౌగిలినుంచి విడివడుతూనే, “ఇంతకి నువ్వు ఆడా, మగా అది చెప్పు” అంది. “అర్ధనారీశ్వరం, ప్రతీవ్యక్తిలోనూ ఆడలక్షణాలూ వుంటాయి, మగలక్షణాలూ వుంటాయి, తెలీదూ” అంటూ మళ్ళీ పెదాలు అందుకోబోయేదు.

ఇంతలో “అర్జున్ గాడేడిరా, బాత్‌రూమ్‌లో వున్నాడా?” అని కేక వినబడింది. ప్రేమికులు చటుక్కున విడిపోయారు. రాధిక సర్దుకొని వెళ్ళి అద్దం ముందు చూసుకోసాగింది – తనూ ఏదో పాత్ర వేస్తున్నట్టు. అర్జున్ చల్లగా జారుకుని, ఎవరి కంటాబడకుండా స్టేజిమీదకు చేరాడు.

ఇంటర్వల్ తర్వాత అర్జున్ పాత్ర మరింత రక్తి కట్టింది. చూస్తున్న రాధికకు ఇబ్బందిగా ఏమీలేదు. ఆమెకు అర్జున్‌లో స్త్రీ కనబడటం లేదు. సంపూర్ణ పురుషుడే అగుపిస్తున్నాడు – అతని బిగికౌగిలి తాలూకు ఒత్తిడి ఆమె శరీరం మరువలేనందున!

(ఆంధ్రప్రభ వీక్లీ ఆగస్టు 1998)

# ఆలూమగలీయం

## 'చూడు, చూడు మేడలు నేడు (రేపుండక పోవచ్చు)

> హైదరాబాద్‌లోని నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ నాణ్యతాలోపం వల్ల కూలిపోయింది - 2000 లో వార్త

"సావిత్రీ, సావిత్రీ పేపరు చూసావా? మళ్లీ ఇంకో కాంప్లెక్స్ కూలిపోయింది."

"సర్లెండి, పనిలో ఉంటే పిల్చి చెప్పేది దీనికా? తక్కిన న్యూస్ నేను చెబుతాను పట్టండి - కాశ్మీరు టెర్రరిస్టుల ఘాతుకానికి ఇద్దరి బలి, దేశ సేవకు పునరంకితం అవుతామని..."

"అబ్బా! ఇలా కూలిపోవడాలు అతి సహజమైపోయాయన్నమాట ఒప్పుకుంటాను కానీ, ఇవాల్టిది స్పెషల్ న్యూస్. నిన్న కూలిపోయినదేమిటో తెలుసా? నువ్వు ఫ్లాట్ కొందామని పట్టుబట్టి బుక్ చేయలేదూ అదే కాంప్లెక్స్! అప్పుడు నేను దూరదృష్టి ఉపయోగించి కాన్సిల్ చేయించేసాను కాబట్టి కానీ..."

"...దూరదృష్టీ కాదూ, వల్లకాడూ కాదు. మీ అమ్మగారు 'ఆ పిచికగూళ్లు ఎందుకురా నీకు' అంటూ సాగదీయడంతో ఈ మాతృవాక్యపరిపాలకుడు.."

"..అమ్మ వద్దన్నమాట నిజమే అయినా, నాకే ఇష్టం లేకపోయింది. దానికంటే చక్కగా ఇండిపెండెంటు హౌస్ అయితే బాగుంటుంది."

"ఇప్పుడున్న ఈ మూడుగదుల వాటా కాపురం కంటే ఏదైనా బాగానే ఉంటుంది. ఊరికే ప్లాన్లే తప్ప ఏదీ అయి చావదు."

"ఖంగారుపడితే ఏదీ అవదు. అప్పుడూ అలాగే ఖంగారు పెట్టి ఫ్లాట్ బుక్ చేయించావు. నీ మాటకు గంగిరెద్దులా తల ఊపి ఉంటే ఏమయి ఉండేది? ఈ పాటికి లబోదిబో అంటూ ఉండేవాళ్లం."


"మనం బుక్ చేసి ఉంటే కూలేది కాదేమో!"

"ఏం? నా ముఖం చూసి ఇసుకలో సిమెంటు కాస్త ఎక్కువ కలిపేవాడా?"

"కలిపినా కలపవచ్చు. పొద్దున్నే నా ముఖం చూస్తే అచ్చివచ్చేదనేవాడు మా నాన్న. నా గుడ్‌లక్ వల్ల కాంప్లెక్స్‌లో అందరికీ లాభం కలిగి గట్టిగా నిలబడేదేమో!"

"ఇలాటి ఇల్లాజికల్, ఇల్లాల్లాజికల్ వాదనలు ఆపు. నీకంత మహిమే ఉంటే నా కోరిక ప్రకారం ఇండిపెండెంటు హౌస్ ఎందుకు అమరలేదు?"

"బాగుంది, మీ డిమాండ్స్ ఏదో కాస్త రీజనబుల్‌గా ఉంటే అమిరేదేమో! మీవి బొత్తిగా గొంతెమ్మ



కోరికలు. ఇల్లు, లాన్, పోర్టికో, దాంట్లో కారు..."

"...అవును. ఉంటే దర్జాగా అలాటి ఇల్లుండాలి. లేకపోతే పిచికగూళ్లల్లా ఈ ఫ్లాట్లు..."

"...ఆ మహాతల్లి నూరిపోసింది. ఈయన చిలకపలుకులు వల్లించేస్తున్నాడు. పిచికగూళ్లు రాకపోతే రాజమహాళ్లు వస్తాయా? అంత ప్రేమ కారిపోతూ ఉంటే ఇమ్మనండి ఓ పది లక్షలు. ఎప్పుడు చూసినా కూతురికి కట్టబెడదామని చూస్తుందే కానీ..."

"... ఆవిడది మనం ఎందుకు ఆశించాలి? తనకు తోచింది తను చెప్పింది. నీకు మాత్రం ఇష్టం కాదా? చక్కటి గార్డెన్ ఉండి.."

"...అన్నీ నాకూ ఇష్టమే -చేసిపెట్టి వాళ్లుంటే! మొక్కలుంటే గార్దెనింగ్ ఎవరు చేస్తారండీ? ఈ మూడుగదులు తుడుచుకోవడానికి ఛస్తున్నా. మీరు వీసమంత సాయం చేయరు..."

"... నువ్వు మాట తప్పిస్తున్నావు. స్వంత ఇల్లు అందంగా ఉంటుందా లేదా?"

".. కాళ్లూపుకుంటూ పేపరు చదువుకుంటూంటే ఈస్థటిక్స్ గురించి ఎంతైనా చెప్పచ్చు! అసలు బాధ నాది. ఎంత పెద్ద ఇల్లుంటే అంత చాకిరి! ఫ్లాటయితే నాలుగు గోడల్లోపల తుడుచుకుంటే సరిపోతుంది. ఇల్లయితే బయట కూడా..."

"...పాయింటే! కానీ ఫ్లాట్ కొందామంటే ఇలా పేకమేడల్లా కూలిపోతున్నాయే!"

"మనం కొంటే అలా కూలవండి. స్ట్రక్చరల్ ఫాల్టు అంటున్నారుగా. ముందే డిజైన్ చూపించుకుంటాం."

"నాకవన్నీ తెలియవుగా!"

"నాకు మాత్రం తెలుసా? మిమ్మల్ని ఆర్కిటెక్టు దగ్గరికి తరవడం, అలా కడుతున్నాడో లేదో చూడమని వేధించడం మాత్రం తెలుసు."

"డిజైన్ బాగా ఉంటే మాత్రం, బిల్డర్ పాళ్లు సరిగ్గా వేసి కట్టకపోతే?"

"అందుకే ఆ కట్టడం అయ్యేవరకూ సెలవు పెట్టి మిమ్మల్ని అక్కడే కూచోమంటాను. పేకాటలు, సభలూ, సమావేశాలు, బార్లూ అన్నీ బంద్!"

"అమ్మబాబోయ్! ఎంత కుట్ర! నేనొప్పుకోను. బిల్డింగులు కూలకుండా, మనం ఫ్లాట్ కొనే ఉపాయం ఇంకోటేదైనా చెప్పు."

"చెప్పమంటారా? కాస్త లాంగ్‌టర్మ్ ప్లాను. ప్రజల్ని కూడగట్టుకు రావల్సి వస్తుంది."

"చెప్పు, అదేమిటో విందాం."

"ఏం లేదు, మంత్రులకు, సెక్రటేరియట్‌లో, కార్పొరేషన్‌లో ఇతరత్రా బిల్డింగు పర్మిట్లు యిచ్చే అధికారులకు - ఉండడానికి బంగళాలు ఎలాట్ చేయకుండా వాళ్లు శాంక్షన్ చేసే కాంప్లెక్స్‌లలో ఫ్లాట్‌లలో ఉండాలని రూలు పాస్ చేయించండి. ఉంటే బిల్డింగు నిలుస్తుంది, పోతే పీడా విరగడవుతుంది."